


## కాంగ్రెస్ పాలనలోని కరెంట్‌ను రైతులు మర్చిపోలేదు

భూపాలపల్లి రూరల్ : కాంగ్రెసోళ్లు రైతుల నాశనాన్ని కోరుకొని అధికారంలోకి రావాలనుకుంటున్నరు. వ్యవసాయరంగంపై కాంగ్రెస్ నాయకులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నరు. 3గంటల కరెంట్‌తో పంటలకు నీళ్లు అందక సాగు విస్తీర్ణం పడిపోతుంది. 10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు ఆర్థిక భారం పడుతది. తెలంగాణ ప్రభుత్వంలో 24 గంటలు ఫ్రీ కరెంట్‌తో పడావుగా ఉన్న భూముల్లో రైతులం వ్యవసాయం చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నం. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయం నాశనమవుతుంది. సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. రైతులకు భరోసా కలిగింది. రైతుబంధు, రైతు బీమా ఇస్తుండటంతో పట్నం నుంచి పల్లెలకు వచ్చి రెండు పంటలు పండించుకుంటున్నం. కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎట్లా ఉండేదో రైతులు ఇంకా మర్చిపోలేదు.

**- పుల్లల వెంకటేశ్, అందుకుతండ, చిట్యాల మండలం**



















## రాత్రిళ్లు పొలాలకు పోవుడే లేదు



గోవిందరావుపేట : కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నది. దీంతో పొద్దున నుంచి సాయంత్రం వరకు పొలానికి నీళ్లు పెట్టుకుంటున్నం. 24 గంటల కరెంట్‌తో చీకట్ల తిరిగే బాధ తప్పింది. గతంలో కరెంట్ కష్టాలతో ఎన్నో ఇబ్బందులు పడ్డం. నేడు 24 గంటల కరెంట్‌తో పాటు రైతులకు రైతు బంధు, బీమా, రుణమాఫీ ఇస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మళ్లా ఓటు వేస్తం. కేసీఆర్ ప్రభుత్వంతోనే రైతుల కష్టాలు తీరుతయి.

**- ధరంసోత్ వెంకట్రామ్, రైతు, పాపయ్యపల్లి, గోవిందరావుపేట**

# కాపాడినోళ్లనే కాపాడుకుంటం..

**కాంగ్రెస్ అంటే దళారుల రాజ్యం**

### మంచిగైన ఎవుసం పాడైతది.. భూముల విలువ పడిపోతది

**కరెంటు లేకుంటే అరిగోస పడుతం.. మా బతుకులను మళ్లీ ఆగం చేసుకోం**

**కేసీఆరే కంటికి రెప్ప.. కడుపున వెట్టుకొని కాసుకుంటున్న బీఆర్‌ఎస్ వెంటే ఉంటం**

**స్పష్టం చేస్తున్న రైతులు, ప్రజలు**

*నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 29 : 'సావునోట్లె తల్కాయవెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆరే, తెలంగాణకు ఏంగావాల్నో ఆలోచించి పనులుజేత్తాండు. నాడు పడావువడ్డ ఎవుసాన్ని పచ్చగజేసిండు. కాంగ్రెస్ పాలనల సుక్కనీళ్లు లేక ఎంతేడ్సినం.. నీళ్లు లేక భూములు ఇడిశిపెట్టి ఎంత గోసపడ్డం.. నాడు భూములకు విలువుండెనా? అప్పలు కట్టలేక అడ్డికిపావుశేరు లెక్క అమ్ముకున్నం.. మళ్ల ఆ రోజులు రావద్దు' అంటున్నారు రైతులు. తమను కంటికి రెప్పలా కాపాడుతున్న కేసీఆర్ వెంటే ఉంటామని స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్‌ల ఒక్కో నాయకుడు ఒక్కో తీరుగ మాట్లాడుతున్నడని, ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదని చెబుతున్నరు. కేసీఆర్ ఎంతో కష్టపడి ఇంత మంచిగ చేసిన వ్యవసాయాన్ని మళ్లీ పాడుచేసుకోబోమని తేల్చి చెబుతున్నారు. ఇప్పడే రైతుల చేతిల్లో నాలుగు పైసలు కనవడుతున్నయని, భూముల ధరలు పెరిగి మొఖం తెలివైందని, రేవుకు వచ్చిన బతుకులను ఆగం చేసుకుంటమా అని అంటున్నరు. కాంగ్రెస్ పాలన అంటే చీకటి రోజులని, వాటిని మళ్లీ తాము కోరుకోవడం లేదని స్పష్టం చేస్తున్నారు. వాళ్లు అబద్ధాలు చెప్పి కర్ణాటకలో అధికారంలోకి వచ్చారని, అక్కడ అమలుకాని హామీలు ఇక్కడ ఎట్ల చేస్తరని ప్రశ్నిస్తున్నరు. రేవంత్‌రెడ్డి అంటున్నట్లు మూడు గంటల కరెంటుతోని ఎవుసం ఎట్లజెయ్యాల్నో ఆయనకే తెలువాలె అని ఎద్దేవా చేస్తున్నారు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టి ఎవుసం చేస్తే భూముల నీళ్లు ఆగుతయా అని ప్రశ్నిస్తున్నారు. రెండు, మూడు ఎకరాలున్న రైతులకు 10హెచ్‌పీ మోటర్లు అవసరమా అని, అంత ఖర్చు ఎవరు పెడుతారని అడుగుతున్నారు. ఇప్పడున్న పరిస్థితికి 24గంటల కరెంటే మేలని, రైతులు తమకు ఎప్పడు అవసరం, వీలు ఉంటే అప్పడు పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నారని, ఇప్పడే ప్రశాంతంగ ఉన్నామని చెబుతున్నారు. ధరణితోని ఏ లొల్లి లేకుండ భూ సమస్యలు తీరుతున్నాయని, దాన్ని తీసేసి కౌలుదారు కాలమ్ పెడితే ఊళ్లలో మళ్లీ రోజూ కొట్లాటలే ఉంటాయని అంటున్నారు. పట్వారీలు, దళారీల రాజ్యం వస్తే రైతులు గోస పడుతారని, ఇప్పడున్న వ్యవస్థనే బాగుందని చెబుతున్నారు. రైతుల బాగోగులు కోరి పెట్టుబడి సాయం, సబ్సిడీ పనిముట్లు, 24గంటల కరెంటు, పుష్కలంగా సాగునీళ్లు ఇస్తున్న బీఆర్‌ఎస్ వెంటే తామంతా ఉంటామని కుండబద్దలు కొడుతున్నారు.*

## 3 గంటల కరెంట్‌తోటి రైతులకు కష్టాలే..

వెంకటాపూర్ : 3 గంటల కరెంట్ ఇస్తానంటున్న కాంగ్రెస్‌తో రైతులకు కషాలె. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్‌తోటి 3ఎకరాలు పండించవచ్చని అంటున్నరు. 3 ఎకరాలు కాదు కదా.. 20గుంటలు కూడా పండించలేం. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. రైతులమంతా పంటలకు ఎప్పుడు కావాలంటే అప్పుడు నీళ్లు పెట్టుకొని ప్రశాంతంగా పండించుకుంటున్నం. కాంగ్రెస్ పాలనలో ఇదివరకు పడ్డ కష్టాలు మాకు తెలుసు. కరెంట్ ఎప్పుడొస్తదో అని ఆ టైంకు అలారం పెట్టుకొని నీళ్ల కోసం రాత్రనక, పగలనక తిరిగెటోళ్లం. రైతులంతా మరోసారి కేసీఆర్‌కే మద్దతు తెలిపి గెలిపించుకుంటం.

**- గాజుల సాంబయ్య, పాపయ్యపల్లి, వెంకటాపూర్**



## కాంగ్రెస్‌ను నమ్మితే కటిక చీకట్లే..

మహదేవపూర్ : గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలతోటి అరిగోస పడ్డం. రాత్రిపూట కరెంట్‌తో కంటిమీద కునుకు ఉండేది కాదు. గోస పడుకుంటనే ఎవుసం చేసినం. కరెంట్ కోతలతో తిప్పలు పడ్డం. బాయిల కాడ మోటర్, ఫ్యూజులు కాలిపోయేది. తెలంగాణ అచ్చినంకనే మాకు కరెంట్ గోస తప్పింది. 24 గంటల కరెంట్, రైతు సంక్షేమ పథకాలతో సంబురంగ ఎవుసం చేసుకుంటానం. కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంట్, బాయిల కాడ 10హెచ్‌పీ మోటర్ పెట్టాలని అంటుండ్రు. గది సాధ్యమైతదా? 3 గంటల కరెంట్‌తో ఒక దొయ్య కూడ పారది. ఇగ ఎవుసం చేసుడెట్ల. మంచిగున్న ఎవుసాన్ని కరాబు చేసుకోం. బాగుపడుతున్న రైతులను గోస పెట్టడానికె కాంగ్రెస్ కుట్రలు చేత్తాంది. కాంగ్రెస్‌ను నమ్మితే కటిక చీకట్లే మిగులుతయ్. రైతుల సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం. రైతుల మేలు కోసం ఆలోచన చేసే సీఎం కేసీఆర్ సారే మళ్లా రావాలె.

**- పోత రమేశ్ , మహదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా**



## అప్పుడు కరెంట్ కోసం పడిగాపులు కాసేటోళ్లం

కృష్ణకాలనీ : కాంగ్రెస్ పాలనలో ఎప్పుడు కరెంట్ వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వకుండేది. బాయిలకాడికి రాత్రింబవళ్లు సద్ది కట్టుకొని పోయి పడిగాపులు కాసెటోళ్లం. రాత్రి సమయాల్లో చేన్లకు నీళ్లు కట్టబోతె పాములు, తేళ్లు కుట్టి రైతులు చనిపోయేటోళ్లు. వచ్చిన కరెంట్ ఒక గంటసేపు కూడ సక్కగ ఉండకపోయేది. అప్పటి దినాలు యాదికొస్తే దుఃఖం వస్తది. ఆ కాలంలో నాగళ్లతో ఎవుసం చేసేటోళ్లం. కానీ కేసీఆర్ సార్ వచ్చినంక 24గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నడు. ఇప్పుడు చేన్లకు ఎప్పుడు నీళ్లు కావాలంటే అప్పుడు పెట్టుకొని పంట పండిస్తున్నం. పంట దిగుబడి కూడ మంచిగ వత్తాంది. చాలా సంతోషంగ ఉంది. నాటి నుంచి రైతులను ఇరుకుట్ల పెట్టుడే వాళ్ల పని. కాంగ్రెస్ పాలన చేయబట్టె రైతులు పేదవారిగా మారారు. రైతులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తం.

**- ఆకునూరి లింగయ్య, రైతు, కాశీంపల్లి, జయశంకర్ భూపాలపల్లి**





## ధరణితోనే రైతుల కష్టాలు తీరినయ్..

ధరణితోనే రైతుల కష్టాలు తీరినయ్. ఒకప్పుడు భూమి పట్టా కావాలంటె పట్వారీ, దళారీలకు లంచాలిచ్చి వారి చుట్టు నెలల తరబడి తిరిగినా పనులైతయనే నమ్మకం బుక్కు వచ్చే వరకు ఉండేది కాదు. ఇప్పుడు మీ సేవలో దరఖాస్తు చేసుకోంగనె గంటలో భూమి మా పేరు పైకి ఎక్కుతాంది. ధరణి తీసేస్తమంటున్న కాంగ్రెస్‌తో దళారులకే లాభం కాని రైతులకు కాదు. కాంగ్రెసోళ్లు సీఎం కేసీఆర్‌ది దొరల పాలన అంటున్నరు. కాంగ్రెసోళ్లు వస్తె దొంగల పాలనయితది. మరోసారి కేసీఆర్ సారే సీఎం కావాలె. ఇప్పటికే పదివేల రూపాయల రైతుబంధు ఇస్తున్న కేసీఆర్‌నే నమ్ముతం.

**- మాలోత్ రమేశ్, పాపయ్యపల్లి, వెంకటాపూర్**



## గతంలో పైసలిస్తేనే పనులయ్యేది..

భూపాలపల్లి రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని అందుబాటులోకి తేవడంతో నకిలీ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడింది. మా భూములను దర్జాగా సాగుచేసుకుంటు జీవిస్తున్నం. గతంలో భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే దళారుల అవసరం ఉండేది. వారు అడిగినంత ఇస్తేనే పనులయ్యేది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తె ధరణిని రద్దు చేస్తామనడం పనికిమాలిన చర్య. ధరణి రద్దయితే గతంలో మాదిరిగా ఇబ్బందులు పడాల్సి వస్తది. అవినీతి, అక్రమాలు, లంచగొండి తనం పెరుగుతది. రైతులు చెప్పులరిగేలా ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తది. ధరణిని యథావిధిగా కొనసాగిస్తేనే రైతులకు న్యాయం జరుగుతది. ధరణి రాకతో భూమి విలువ పెరిగింది. ఎవరైనా అక్రమంగా భూమిని ఎక్కించుకుని ఉంటే తొలగించవచ్చు. రైతుల భూమిని మ్యాప్ ద్వారా చూసుకోవచ్చు. పాత, కొత్త పాసు పుస్తకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. భూములు అమ్మడం, కొనుగోలు చేయడం చాలా సులభమైంది.

**- దోపిడి ప్రసాద్, చైన్‌పాక, చిట్యాల మండలం**



## ధరణిని తీసేస్తే రోజూ భూ పంచాయితీలే..

కాటారం : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తమంటున్నరు. ధరణితో వారికి వచ్చిన సమస్య ఏమిటో అర్థం కావడం లేదు. భూములన్నిటిని బీఆర్‌ఎస్ సర్కారు పకడ్బందీగా ఆన్‌లైన్ చేసింది. ఎలాంటి గొడవలు లేవు. కాంగ్రెస్ వస్తే ఇక రోజూ భూమి పంచాయితీలే. పట్టాలన్ని గోల్‌మాల్ చేస్తరు. నా భూమి.. నీ భూమి అని రైతులు కొట్టుకొని సావాలె. రిజిస్ట్రేషన్ కోసం నెలల తరబడి ఆఫీసులు, అధికారుల చుట్టు తిరగాలె. బీఆర్‌ఎస్ సర్కారు తెచ్చిన ధరణితో రైతులు ఎవడి కాళ్లు పట్టుకునే పనిలేకుండానే దర్జాగా పట్టా చేసుకుంటున్నడు.

**- జక్కుల రాజేందర్, రైతు, ప్రతాపగిరి, కాటారం**



## భూములను బీడు పెట్టుకోవాల్సిందె

గోవిందరావుపేట : కాంగ్రెసోళ్లు చెబుతున్న 3 గంటల కరెంట్‌తో ఎవుసం చేయడం ఎలా? 3 గంటల కరెంట్‌తో మా భూములు బీడు పెట్టుకోవాల్సిందె. గత ప్రభుత్వ హయాంలో ఎకరం పొలం తడుపుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డం. రాత్రనక, పగలనక పొలాల కాన్నే పండాల్సి వచ్చేది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాకు కరెంట్ కష్టాలే లేవు. 24 గంటల ఉచిత విద్యుత్‌తో సంబురంగ ఎవుసం చేసుకుంటున్నం. మళ్లీ మూడోసారి రైతుల పాలిట దేవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అవుతడు.

**- గాందర్ల మోహన్, రైతు, నేతగానిగూడెం, గోవిందరావుపేట మండలం**



## కాంగ్రెస్ వస్తే మళ్ల పాత రోజులే..

కాటారం : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులే వస్తయి. 10 హెచ్‌పీ మోటరుతో గంటలో ఎకరం నీరు పారించవచ్చని రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదం. కేసీఆర్ వచ్చాక 24 గంటల విద్యుత్ నిరంతరాయంగా వస్తుండడంతో రైతులు ఎప్పుడు పడితే అప్పుడు పొలాలకు నీళ్లు పారించుకుంటు పంటలు పండిస్తున్నరు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల పరిస్థితి ఎలా ఉంటుందోనని భయం పుట్టుకొస్తున్నది. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే రైతులకు మేలు జరుగుతుంది.

**- లింగాల దుర్గయ్య, రైతు, బూడిదపల్లి, కాటారం**